క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న ప్రజలు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెలసిన వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకులు, నరసింహులు ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను అభిషేకించి పట్టువస్త్రాలు, పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. తదనంతరం వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులతో స్వామి అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేయించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, సుద్దమల్ల, ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వాములకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): డోన్ నుంచి సోమయాజులపల్లె వరకు నిర్మించనున్న జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపరిహారం చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 50 కి.మీ.రోడ్డుకు డోన్, బేతంచెర్ల, ఓర్వకల్లు మండలాలకు సంబంధించి 360 మంది రైతుల నుంచి 135 ఎకరాలు సేకరించారన్నారు. రూ.630 కోట్లు టెండరు వేసి పనులు ప్రారంభించారని, రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సోమన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పథకాలు వర్తింపజేయాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌ల సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10, 11 తేదీల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు తోటమద్దులు, బాలవెంకట్, గురుస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం

దొర్నిపాడు: ఇంటి వద్ద ప్రసవాలు మంచిది కాదని ప్రభుత్వ వైద్యశాలల్లోనే సురక్షితం అని డాక్టర్ నాగేంద్ర సూచించారు. శనివారం మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన స్వాతి అనే గర్భిణికి తొలికాన్పులో భాగంగా పురిటి నొప్పులు రావడంతో సహజ కాన్పును చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. వైద్యపరీక్షల అనంతరం వారిని డిశ్చార్జ్ చేశారు. వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు 2022 పీఆర్సీతో కలిపి డీఏ, ఇంక్రిమెంట్లతో కూడిన వేతనాలు చెల్లించాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, అర్హతలను గుర్తించి రెగ్యులర్ ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ఆదిశేషు, రహీం, వెంకటేష్, రవి, హరీష్, తిరుపాలు, కార్తీక్, భార్గవ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లు పార్లమెంట్‌లో చట్టబద్ధమయ్యేలా చూడాలని కోరుతూ ఈనెల 23వ తేదీన నిర్వహించే వాల్మీకుల ర్యాలీని జయప్రదం చేయాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 23న ఆదివారం టెక్కె మార్కెట్‌యార్డు నుంచి బస్టాండ్ సమీపంలోని వాల్మీకి మహర్షి విగ్రహం వరకు జరిగే ర్యాలీ నిర్వహిస్తామని వాల్మీకులు పాల్గొనాలని కోరారు. నాగేశ్వరరావు, జయరాముడు, మధుగోపాల్, నారాయణ, నాగేంద్ర, శ్రీనివాసులు, సవారి పాల్గొన్నారు.



రుద్రవరంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు



శిరివెళ్లలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలవేస్తున్న కార్యకర్తలు



దొర్నిపాడులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజల మదిలో చెరగని రాజముద్ర

- పల్లెపల్లెన వైఎస్సార్ జయంతి
- నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ఆళ్లగడ్డ: సంక్షేమ పథకాల ద్వారా ప్రజల మదిలో దివంగత సీఎం వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ రైతు దినోత్సవ వేడుకలు శనివారం నియోజవర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా నాలుగు రోడ్ల కూడలి చేరుకొని అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత విద్యుత్‌తో 20ఏళ్లుగా రెండు రాష్ట్రాల్లో కోట్లాది మంది రైతులు నేడు లబ్ధి పొందుతున్నారంటే అది వైఎస్సార్ చలువేనన్నారు. ఆయన చేపట్టిన జలయజ్ఞం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల్లో రెండు పంటలు పండించుకుంటున్నామంటే ఆ చేపట్టిన పనులేనని గుర్తు చేశారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాయబ్ రసూల్, నజీర్, మాదం చెన్నయ్య, శివనాగిరెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు చిన్నకంబలూరు,కోటకొండ,ఆలమూరు,పేరూరు,నర్సాపురం చిత్రేనిపల్లె తదితర గ్రామాల్లో శనివారం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వేడుకగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఏపీ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి గుంటూరు వారి ఆధ్వర్యంలో స్టేట్ కో ఆర్డినేటర్ వరలక్ష్మి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఎంపీపీ బాలస్వామి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి లక్ష్మీనారాయణ, కన్వీనర్లు పాణ్యం నాగేష్,వినోద్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శూలం ప్రభాకర్,నాయకులు కొల్లం పుల్లయ్య,లింగం బ్రహ్మయ్య,బైరి శంకర్,ఏర్వ కృష్ణమూర్తి,కేసీ నరసింహులు,శీను,పెద్దన్న పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: మండలంలో శనివారం వైఎస్సార్ జయంతిని ఘనంగా జరిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, గోవిందపల్లె, యర్రగుంట్ల, కోటపాడు, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం, జీనేపల్లె, బోయలకుంట్ల, మహదేవపురంలో వైఎస్సార్ చిత్ర పటాలు, విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బి. అబ్దుల్ సలాం, నజీర్, సర్పంచు సాలమ్మ, నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచులు సుభహాన్, మందాల శివారెడ్డి, దూదేకుల గురప్ప, జింకల నాగన్న, ప్రసాదరెడ్డి, పెద్ది రమణ, రఘునాథరెడ్డి, వైస్ ఎంపీపీ చీమల అనూష, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, ఉప సర్పంచులు ఇంతియాజు, సత్తార్ ప్రతాపరెడ్డి, సొసైటీ చైర్మన్ మేరువ చిన్న నాగిరెడ్డి పాల్గొన్నారు.



నంద్యాలలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

చాగలమర్రి: తన సేవలతో రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని జెడ్పీటీసీ లక్ష్మీదేవి అన్నారు. వైఎస్సార్ జయంతిని ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. శనివారం శెట్టివీడు గ్రామంలోని సచివాలయ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. మండల నాయకుడు బాబులాల్ ఆధ్వర్యంలో చాగలమర్రిలోని పెద్దమకానం వద్ద, ముత్యాలపాడు గ్రామంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్ వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమార్ రెడ్డి, ఎంపీపీపి వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, గణేష్‌రెడ్డి, ముల్లా ఖాదర్ బాషా, వెంకటరమణ, రమణ గుప్త, కొండయ్య, నాయబ్ రసూల్, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, గౌస్‌పీర్, డి.మన్సూర్, బురాందీన్, షరీఫ్, గేట్ల మాబు, శ్రీనివాసులు గౌడ్, నాగేంద్ర పాల్గొన్నారు.

దొర్నిపాడు: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే అన్ని ఆర్బీకేల్లో వైఎస్సార్ చిత్రపటాలకు నివాళులర్పించారు.జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచి దేవికామణి, నాయకులు శివరామిరెడ్డి, డీలర్ శివుడు, మోహన్‌నాయుడు, చిన్న వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కాకనూరు మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నర్సిరెడ్డి, రామకృష్ణ, నాగరాజు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొండాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ : రైతుల హృదయాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మండల రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ 74వ జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. సర్పంచ్ మేకల ఓబులేసు, సింగిల్‌విండో అధ్యక్షుడు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు లాలమ్మగారి హుసేనయ్య, ముసాని విశ్వనాథరెడ్డి, మండల స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ ముసాని శివానందరెడ్డి పాల్గొన్నారు.





కేక్ కట్ చేస్తున్న హబీబుల్లా , వైఎస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు,



వెఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు,



యాళ్లూరులో ..

ఘనంగా వైఎస్సార్ జయంతి

నంద్యాల/(అర్బన్)/(వ్యవసాయం)/(రూరల్)/గోస్పాడు: వైఎస్సార్ జయంతిని నంద్యాల నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస సెంటర్, సాయిబాబానగర్, వై జంక్షన్ వద్ద ఉన్న వెఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శివరాం, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లె రాకేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్ధం శివరాం పాల్గొన్నారు. అలాగే.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా ఆధ్వర్యంలో, నంద్యాల మండలం కానాల గ్రామంలో జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీ రంగారావు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉప్పుజగన్‌ప్రసాద్, విజయశేఖర్‌రెడ్డి, నందిరైతు సమాఖ్య నాయకులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, పుల్లారెడ్డి, ఓబులపతి, రామేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, ఊకొట్టువాసు, ఎస్‌వైడీ ప్రసాద్, రఫీ, బాలయ్య, ఆనందరావు, రెవెన్యూ క్వార్టర్స్‌లో గ్రామీణ వైద్యుల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

గోస్పాడులో..

మండల కేంద్రమైన గోస్పాడు, యాళ్లూరు గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోస్పాడులో ఎంపీపీ ఆర్థర్ సైమాన్, యాళ్లూరులో ఉపసర్పంచ్, బొక్కెం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని జగజ్జననీ మాతకు శనివారం భక్తులు సారె సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నంద్యాల ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు చీర, సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



సారెను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

గ్రామీణ రహదారులకు మహర్దశ



త్వరలో నూతన రహదారిగా మారనున్న కంపమళ్ల - గోవిందిన్నె రోడ్డు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక గుంతలమయంగా మారిన రహదారులను రూపుదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి శనివారం తెలిపారు. ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామం నుంచి ప్రస్తుతం వేసిన సీసీ రోడ్డు నుంచి అనుసంధానంగా ఆళ్లగడ్డ వైపు అటవీ సమీపంలోకి సీసీ రోడ్డు వేసేందుకు రూ. 300 లక్షలు, ఆళ్లగడ్డ పట్టణం నుంచి చిన్నకందుకూరు మీదుగా వైఎస్సార్ కడప జిల్లా సుద్దపల్లె వరకు (జమ్ములమడుగు) రూ. 315 లక్షలు, కోవెలకుంట్ల మండలం కంపమళ్ల మెట్ట నుంచి దొర్నిపాడు మండలం డబ్ల్యూ.గోవిందిన్నె రహదారికి రూ.175 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. త్వరలోనే రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యూసీసీని వ్యతిరేకించాలి

నంద్యాల(వ్యవసాయం): యూనిఫాం సివిల్ కోడ్ అమలుపై కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకించాలని శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. లౌకిక ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ అబులైజ్, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ ఆధ్వర్యంలో డబరేవాల మసీదు ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పలు మతాలు, సాంస్కృతిక ఆచారాలతో కలిసి మెలిసి జీవిస్తున్న దేశ ప్రజలకు ఉమ్మడి పౌరస్మృతి ఆమోద యోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలోని బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఈ చట్టం వ్యతిరేకంగా ఓటు వేయాలని రాష్ట్రంలోని అన్ని పార్టీలను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులతో పాటు మస్తాన్‌వలి, అతావుల్లాఖాన్, ఫిరోజ్, మౌలానా ఖలీల్ అహమ్మద్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సలాముల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సలాముల్లా

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శనివారం షష్టి సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

నంద్యాల(న్యూటౌన్): గోస్పాడు కేజీబీవీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న లక్ష్మీప్రసన్నకు పాముకాటుతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరిందని, బాలికకు మెరుగైన వైద్యం అందజేయాలని దళిత హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెన్నయ్య, ప్రభాకర్ కోరారు. శనివారం లక్ష్మీప్రసన్నను పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ ఏ మాత్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు.పూర్తిగా కోలుకునేంత వరకు పాఠశాల యాజమాన్యమే అండగా ఉండాలన్నారు. మోటా రాముడు, గోకారి పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య పరీక్షలు



వృద్ధురాలికి ఇంటి వద్దే వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటి వద్దకే వెళ్లి డాక్టర్ నాగేంద్ర వైద్యపరీక్షలు చేశారు. అనంతరం పక్షవాతం, వెన్నెముక వ్యాధీ, గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులను పరీక్షించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ పుల్లయ్య, ఎంఎల్‌హెచ్‌పీ విమల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన మాబాషా కూతురు చిన్నారి ఆస్మాపై దాడి చేసింది. ఈ ఘటనలో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కోవెలకుంట్లలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

రైతు పక్షపాతి జగనన్న



చాగలమర్రిలో వర్షంలో తడుస్తూ..మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: అపర భగీరథుడుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్సార్ తనయుడిగా, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రైతు పక్షపాతిగా పేరుగాంచారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు 4 పర్యాయాలు నష్ట పరిహారాన్ని రైతులకు అందించిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారన్నారు. దీన్ని బట్టి వ్యవసాయానికి ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. శనివారం స్థానిక 5వ సచివాలయ పరిధిలోని గుంతపాళెం వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా గడప గడపకు తిరిగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఉప సర్పంచ్ షేక్. మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, ఫయాజ్, బబ్లూ షోయబ్, నాయబ్ రసూల్, చక్రం షబ్బీర్, ఖాజా, డైరెక్టర్ గౌస్‌పీర్, జాబిర్, ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఈఓఆర్‌డీ సుదర్శనరావు, ఏఈలు షాజహాన్, కొండారెడ్డి పాల్గొన్నారు.

కడమల కాల్వలో అతిసార నివారణకు చర్యలు



బాధితుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామంలో అతిసార నివారణ కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గ్రామంలో మరోసారి అతిసారం పెరగడంతో శనివారం ఆయన గ్రామానికి చేరుకొని రైతుభరోసా కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. ఆహారం, నీరు కలుషితం అవడం వల్లే అతిసారం ఎక్కువవుతుందన్నారు. గ్రామస్తులు తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు వడకాచి చల్లార్చి తాగాలని సూచించారు. అలాగే పారిశుధ్యపనులపై మండల పరిషత్ అధికారులతో మాట్లాడారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. సెలవురోజులు ఉండటంతో రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా తమినాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆర్జితసేవా టికెట్లు, అభిషేకాలు, ప్రసాదాల విక్రయం, వసతిగృహాలు తదితర విభాగాల ద్వారా ఒకేరోజు ఆలయానికి సుమారు రూ. 5లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. మహానందిలో నంద్యాలకు చెందిన ఆధ్యాత్మిక ప్రవచకులు దివిహయగ్రీవాచార్యులు ఆధ్వర్యంలో రెండో రోజు విరాట పర్వం పారాయణం చేశారు.